# మీఖాత్

# ٢ - بَابُ الْمَوَاقِيْتِ

## (ఇహ్రామ్ పూనవలసిన ప్రదేశాలు)

(٥٩٠) عَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَدِيْنَةِ ذَا الْحُلَيْفَةِ، وَلِأَهْلِ الشَّامِ الْجُحْفَةَ، وَلِأَهْلِ نَجْدٍ قَرْنَ الْمَنَازِلِ، وَلِأَهْلِ الْيَمَنِ يَلَمْلَمَ، هُنَّ لَهُنَّ، وَلِمَنْ أَتَى عَلَيْهِنَّ مِنْ غَيْرِهِنَّ، مِمَّنْ أَرَادَ الْحَجَّ وَالْعُمْرَةَ، وَمَنْ كَانَ دُوْنَ ذٰلِكَ فَمِنْ حَيْثُ أَنْشَأَ، حَتّٰى أَهْلُ مَكَّةَ مِنْ مَكَّةَ. مُتَّفَقٌ عَلَيْهِ.

590. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనావాసుల కోసం 'జుల్ హులైఫా'ను, సిరియావాసుల కోసం 'జుహ్ఫా'ను, నజ్ద్ ప్రాంతం వారి కొరకు 'ఖర్నె మనాజిల్'ను, యమన్‌వారి కొరకు 'యలమ్‌లమ్'ను ఇహ్రామ్ కట్టుకునే సంకల్పం చేసుకునే స్థలాలు (మీఖాత్‌లు)గా నిర్ధారించారు. ఇతర పట్టణాలనుంచి, ఇతర ప్రదేశాలనుంచి హజ్ మరియు ఉమ్రాల కొరకు వచ్చే వారి కొరకు కూడా ఇవి 'మీఖాత్'గా ఉంటాయి. ఇక ఈ (మీఖాత్) పరిధి లోపల ఉండేవారు, తాము బయలు దేరిన చోటునుంచే ఇహ్రామ్ కట్టుకోవాలి. మక్కావాసులు మక్కానుండే ఇహ్రామ్ కట్టుకోవాలి." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

ప్రపంచం నలుమూలల నుంచి హజ్ మరియు ఉమ్రాల కోసం వచ్చేవారికై కొన్ని స్థలాలు 'మీఖాత్'లుగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆ స్థలాలు చేరుకోకముందే 'ఇహ్రామ్' దీక్షబూనినా తప్పు లేదు గాని ఆ స్థలాలు దాటి లోపల ప్రవేశిస్తే మాత్రం హజ్‌గానీ, ఉమ్రాగానీ నెరవేరదు. ఎందుకంటే హజ్ లేక ఉమ్రాల కొరకు 'ఇహ్రామ్' కట్టుకోవటం అవసరం.

591. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇరాక్ వాసుల కోసం 'జాతె ఇర్ఖ్'ను మీఖాత్‌గా నిర్ధారించారు. (అబూ దావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. దీని మూలం 'ముస్లిం'లో హజ్రత్ జాబిర్ ఉల్లేఖనం ఆధారంగా ఉంది. అయితే దీన్ని అందజేసిన వారు ఇది 'మర్ఫూ' అనే విషయంపై అనుమానాన్ని వ్యక్తం చేశారు)

(٥٩١) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْعِرَاقِ ذَاتَ عِرْقٍ. رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَأَصْلُهُ عِنْدَ مُسْلِمٍ مِنْ حَدِيثِ جَابِرٍ، إِلاَّ أَنَّ رَاوِيَهُ شَكَّ فِيْ رَفْعِهِ.

'జాతె ఇర్ఖ్'ను మీఖాత్‌గా నిర్ధారించింది హజ్రత్ ఉమర్ (రజి) అని సహీహ్ బుఖారీలో ఉంది.

وَفِيْ صَحِيْحِ الْبُخَارِيِّ: أَنَّ عُمَرَ هُوَ الَّذِيْ وَقَّتَ ذَاتَ عِرْقٍ.

అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలలో పొందుపరచబడిన హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనంలో ఇలా వుంది - "దైవప్రవక్త (సఅసం) తూర్పు ప్రాంతాల వారికై 'అఖీఖ్'ను మీఖాత్‌గా నిర్ణయించారు."

وَعِنْدَ أَحْمَدَ وَأَبِيْ دَاوُدَ وَالتِّرْمِذِيِّ عَنْ ابْنِ عَبَّاسٍ، أَنَّ النَّبِيَّ ﷺ وَقَّتَ لِأَهْلِ الْمَشْرِقِ الْعَقِيْقَ.

## సారాంశం

'వాదియె ఫాతిమా'గా నేడు ప్రసిద్ధిచెందిన 'మర్రుజ్జహ్రాన్' లోయ వాస్తవానికి తాయఫ్ పట్టణానికి ముందు - మక్కాకు తూర్పు - నుంచి మొదలై దక్షిణ జెద్దాకు సమీపంలో అహ్మర్ సముద్రం పశ్చిమం వైపునకు సమాప్తమవుతుంది - ఈ లోయకు రెండు అంచులున్నాయి. దీని దక్షిణ అంచు తాయఫ్ మార్గంలో గల పెద్ద లోయ దగ్గర 'నఖ్లె యమానియా' కన్నా ముందు ఉంది. దీనినే 'ఖర్నె మనాజిల్' అని అంటారు. ఇక రెండవ ఉత్తర అంచు జరీబాకు చేరువలో 'జాతె ఇర్ఖ్' వద్ద ఉంది. ఇరాక్ ప్రజలు, నజ్ద్ ప్రాంతం వారు ఇటువైపునుంచే వెళతారు. ఈ రెండు అంచుల మధ్య చాలా అంతరం ఉంది. అయితే ఈ రెండు స్థలాలనుంచి పవిత్ర మక్కా నగరం సమాన దూరంలో ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హజ్రత్ ఉమర్ (రజి) 'ఇజ్తిహాద్' చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనార్హం. కాబా గృహానికి చేరుకోవటానికి ముందు నిర్ధారిత ఐదు మీఖాత్‌లలో ఏ ఒక్క మీఖాత్ మీదుగా కూడా పోలేని వ్యక్తి - కనీసం ఆ మీఖాత్‌ల నుంచి కాబా గృహం ఎంత దూరం ఉంటుందో లెక్కకట్టి అంతదూరం నుంచే ఇహ్రామ్ కట్టుకోవటం అవసరం. ఈ దూరాన్ని అంచనావేసిన మీదటే హజ్రత్ ఉమర్ (రజి) గారు 'జాతె ఇర్ఖ్'ను ఇరాక్ ప్రజల కోసం 'మీఖాత్'గా నిర్ణయించారు. ధర్మవేత్తలంతా ఈ 'ఇజ్తిహాద్'తో ఏకీభవించారు. కాబా

గృహానికి ఐదువైపులా మీఖాత్‌లుగా నిర్ధారించబడిన ఐదు స్థలాలను కలుపుతూ రేఖ గీస్తే అది పవిత్ర మక్కాను అన్ని వైపులనుంచి దిగ్బంధం చేసిన వలయాకారం ఏర్పడుతుంది. కనుక ప్రపంచం ఏమూల నుంచి వచ్చినా యాత్రికులు ఈ వలయాకారాన్ని దాటి లోపలకు వెళ్ళవలసిందే. అదీగాక ఈ వలయాకారం సముద్ర స్థలంలో గాకుండా భూభాగంపైననే ఉంది. కాబట్టి ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి తూర్పు దేశాలనుంచి హజ్ లేక ఉమ్రా కొరకు సముద్ర ప్రయాణం చేసి వెళ్ళేవారు జెద్దా వరకూ ఇహ్రామ్ దీక్షబూనవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారు పయనించే ఓడ 'యలమ్‌లమ్' అనే మీఖాత్‌ను ఇంకా సమీపించనే లేదు.

## ٣ - بَابُ وُجُوهِ الإِحْرَامِ وَصِفَتُهُ

## 3వ అధ్యాయం

## ఇహ్రామ్ రకాలు - వాటి గుణాలు

(٥٩٢) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: خَرَجْنَا مَعَ رَسُولِ اللّٰهِ ﷺ عَامَ حَجَّةِ الْوَدَاعِ، فَمِنَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ وعُمْرَةٍ، وَمِنَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، وَأَهَلَّ رَسُولُ اللّٰهِ ﷺ بِالْحَجِّ، فَأَمَّا مَنْ أَهَلَّ بِعُمْرَةٍ فَحَلَّ عِنْدَ قُدُومِهِ، وَأَمَّا مَنْ أَهَلَّ بِحَجٍّ، أَوْ جَمَعَ بَيْنَ الْحَجِّ وَالْعُمْرَةِ، فَلَمْ يَحِلُّوا حَتَّى كَانَ يَوْمُ النَّحْرِ. مُتَّفَقٌ عَلَيْهِ.

592. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి హజ్జతుల్ విదా (అంతిమ హజ్‌యాత్ర)కై బయలు దేరాము. మాలో కొంతమంది ఉమ్రా కొరకు 'తల్బియా' చెప్పారు. కొంతమంది హజ్ మరియు ఉమ్రాల కోసం 'తల్బియా' పలికారు. మరికొంతమంది హజ్ కొరకు 'లబ్బైక్' చెప్పారు. దైవప్రవక్త (సఅసం) కేవలం హజ్ కొరకు 'తల్బియా' పలికారు. ఉమ్రా కోసం 'తల్బియా' పలికిన వారు 'ఇహ్రామ్' నిబంధనల నుంచి విముక్తులైపోయారు. హజ్ కోసం లబ్బైక్ నినాదాలు చేసినవారు, హజ్ మరియు ఉమ్రాల కోసం లబ్బైక్ పలికినవారు ఖుర్బానీ దినం వచ్చే వరకూ 'ఇహ్రామ్' కు కట్టుబడే ఉన్నారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

హజ్ మూడు రకాలని ఈ హదీసు ద్వారా విదితమవుతోంది: (1) హజ్జె ఖిరాన్ (2) హజ్జె తమత్తు (3) హజ్జె ఇఫ్రాద్. ఈ మూడింటిలో శ్రేష్ఠమైన హజ్ ఏది? సాధారణంగా హజ్జె ఖిరాన్‌ను హనఫీలు, అహ్లె హదీసువారు శ్రేష్ఠమైన హజ్‌గా భావిస్తారు. ఎందుకంటే పవిత్రుడైన అల్లాహ్